సాక్షి
ఖమ్మం
మంగళవారం ॥ 7 ॥ జనవరి ॥ 2025



మమ్మల్నీ ఆదుకోండి..
ఏడాది క్రితం కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయగా మిగిలిన వారి సర్వీసును సైతం క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు. 8లో



ఆంగ్లంపై భయం పోగొట్టాలి
ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ఇంగ్లిష్‌పై భయాన్ని పోగొట్టి మెరుగైన శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. 8లో

గరిష్టం/కనిష్టం 29°/15°

వాతావరణం
జిల్లాలో మంగళవారం ఉదయం, రాత్రి చలిగాలుల తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం కూడా సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి.

న్యూస్‌రీల్

ఫ్రీజర్ల కొనుగోలుకు రూ.8లక్షల మంజూరు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మార్చురీలో ఫ్రీజర్ల కొనుగోలుకు ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి రూ.8 లక్షలు మంజూరు చేశారు. ఇటీవల ఆయన పెద్దాస్పత్రిని సందర్శించిన సందర్భంలో ఫ్రీజర్ల కొరత ఉందని సూపరింటెండెంట్ తెలిపారు. దీంతో ఆరు ఫ్రీజర్ల కొనుగోలుకు రూ.8లక్షల ఎంపీ నిధులు కేటాయించారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమ్మె విరమణ

ఖమ్మం సహకారనగర్: సర్వీసు క్రమబద్ధీకరణతో పాటు ఇతర సమస్యల పరిష్కారం సమగ్ర శిక్షా అభియాన్(ఎస్‌ఎస్‌ఏ) ఉద్యోగులు చేస్తున్న సమ్మెను సోమవారం విరమించారు. అయితే, రోజులాగే సోమవారం కలెక్టరేట్ వద్ద వంటావార్పుతో నిరసన తెలిపారు. అనంతరం ఉద్యోగ సంఘం నాయకులు హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో చర్చించగా సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. దీంతో సమ్మె విరమించామని, మంగళవారం నుంచి యథావిధిగా విధులు నిర్వర్తిస్తామని ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహబూబ్ పాషా తెలిపారు.

మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కె.సత్యనారాయణ తెలిపారు. గ్రూప్–1 ప్రిలిమ్స్, గ్రూప్–2, 3, 4తో పాటు కేంద్ర ప్రభుత్వ స్టాఫ్ సెలక్షన్ కమిషన్, ఆర్‌ఆర్‌బీ, బ్యాంకు పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. నాలుగు నెలల పాటు కొనసాగే శిక్షణకు డిగ్రీ పూర్తి చేసుకున్న మైనార్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తుతోపాటు ఆధార్‌కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, డిగ్రీ మెమో, రెండు ఫొటోలు జతచేసి కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఈనెల 10లోగా సమర్పించాలని, వివరాలకు 97040 03002 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పెండింగ్ పనుల్లో వేగం పెంచండి



శాఖల వారీగా సమీక్షిస్తున్న జెడ్పీ సీఈఓ దీక్ష

కొణిజర్ల: వివిధ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలని జెడ్పీ సీఈఓ దీక్షా రైనా సూచించారు. కొణిజర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఆమె సోమవారం వివిధ శాఖల ప్రగతిపై సమీక్షించారు. పనుల వారీగా వివరాలు తెలుసుకున్న ఆమె త్వరగా పూర్తి చేయాలని సూచించడంతో పాటు ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈసమావేశంలో ఎంపీడీఓ ఏ.రోజారాణి, తహసీల్దార్ తఫజల్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల అమలుపై శ్రద్ధ



మాట్లాడుతున్న సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్‌రావు

ఖమ్మంలీగల్: బాలలకు ఉన్న హక్కులు అమలయ్యేలా శ్రద్ధ వహించాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్‌రావు సూచించారు. ఖమ్మంలోని సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈమేరకు హక్కుల పరిరక్షణకు ఉన్న చట్టాల అమలుపై దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం మామిడి హన్మంతరావు, విష్ణువందన, పసుమర్తి లలిత చట్టాలపై అవగాహన కల్పించగా, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు. అలాగే, ఖమ్మం అర్బన్ మండలం వైఎస్సార్‌నగర్ కాలనీలో జరిగిన సమావేశంలో కే.వీ.చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులు, పేదలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు ఎలా చేసుకోవాలో అవగాహన కల్పించారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మల్లెబోయిన వలరాజు తదితరులు పాల్గొన్నారు.



కూసుమంచి మండలం దుబ్బతండాలో పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

ఉమ్మడి జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వివరాలు

వివరాలు	ఖమ్మం	కొత్తగూడెం
టెండర్లు పిలిచినవి	7,229	5,307
నిర్మాణం ప్రారంభం కానివి	467	128
నిర్మాణాలు పూర్తయినవి	5,939	2,973
నిర్మాణంలో ఉన్నవి	823	2,206
లబ్ధిదారులకు అప్పగించిన ఇళ్లు	5,501	2,759
పంపిణీకి సిద్ధంగా ఉన్నవి	606	214



ఈ ఇళ్లు ఇచ్చేద్దాం..

నిర్మాణం పూర్తయిన 'డబుల్' ఇళ్ల పంపిణీకి కసరత్తు
- మరోపక్క వివిధ దశల్లో ఉన్న వాటి పూర్తికి చర్యలు
- లబ్ధిదారుల అర్హతలపై త్వరలోనే స్పష్టత
- ఆపై 'ఇందిరమ్మ' పథకంపై దృష్టి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: వివిధ దశల్లో నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనుల పూర్తి, కేటాయింపుపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లను అర్హులకు పంపిణీ చేయడంతో పాటు వివిధ దశల్లో ఉన్న పనుల పూర్తికి కసరత్తు మొదలైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 12,536 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేశారు. ఇందులో కొన్నింటి నిర్మాణాలు పూర్తయినా పంపిణీ చేయకపోగా, మరికొన్ని ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిని సైతం పూర్తిచేసి లబ్ధిదారులకు కేటాయించాక మిగిలిన అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై కార్యచరణ రూపొందించనున్నట్లు తెలుస్తోంది.

8,260 ఇళ్ల పంపిణీ..
ఉమ్మడి ఖమ్మం జిల్లాకు 12,536 ఇళ్లు మంజూరు కాగా..8,260 ఇళ్లను ఇప్పటి వరకు పంపిణీ చేశారు. మరో 3,029 ఇళ్ల నిర్మాణం పురోగతిలో ఉంది. కొన్నిచోట్ల పునాదులు తీసి వదిలేయగా, మరికొన్ని మాత్రం శ్లాబ్ వరకు పూర్తయ్యాయి. అలాగే చిన్న చిన్న పనులు చేయాల్సినవి ఇంకొన్ని ఉన్నాయి. ఈ ఇళ్లపనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే వీటిని సిద్ధం చేసి లబ్ధిదారులను ఎంపిక చేసి పంపిణీ చేయనున్నారు. అయితే, లబ్ధిదారుల ఎంపిక పాత జాబితా ఆధారంగా జరుగుతుందా, ప్రజాపాలన సభల్లో అందిన దరఖాస్తుల ఆధారంగా చేపడుతారా అన్నది తేలాల్సి ఉంది.

820 ఇళ్లు రెడీ
నిర్మాణాలు పూర్తయిన 820 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. అయితే లబ్ధిదారుల ఎంపిక చేయాల్సి ఉంది. గతంలో గ్రామసభలు నిర్వహించినా రకరకాల కారణాలతో కొలిక్కి రాలేదు. లబ్ధిదారుడు అర్హుడు కాదనో.. ఒకే కుటుంబానికి రెండు ఇళ్లు వచ్చాయనో, ఇలా రకరకాల కారణాలతో పెండింగ్ పడింది. దీంతో ఈసారి అవాంతరాలు ఎదురుకాకుండా కార్యాచరణ రూపొందించాక ఇళ్ల పంపిణీపై నిర్ణయం వెలువరించనున్నారు.

ఆ తర్వాతే 'ఇందిరమ్మ'
డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ సంపూర్ణంగా పూర్తయ్యాకే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల కోసం అందిన దరఖాస్తుల ఆధారంగా సర్వే కొనసాగుతోంది. సర్వే పూర్తయిన ప్రాంతాల్లో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు డబుల్ చెక్ చేస్తున్నారు. ఇదంతా అయిపోయాక లబ్ధిదారుల జాబితాను ప్రకటిస్తారు. కాగా, సంక్రాంతికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. దీంతో అటు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు, ఇటు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులు త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశం కనిపిస్తోంది.

ఎనిమిదేళ్లుగా అసంపూర్తిగానే..
నేలకొండపల్లి మండలం సింగారెడ్డిపాలెంలో రెండు పడక గదుల ఇళ్ల సముదాయం నిర్మాణానికి 2017 డిసెంబర్ 22న అప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఆ పనులు నేటికి పూర్తి కాక లబ్ధిదారుల సొంతింటి కల నెరవేరడం లేదు. పనులు ఎప్పటికీ పూర్తవుతాయి, ఇళ్లు తమ చేతికి ఎన్నడు వస్తాయోనని ఎదురుచూస్తున్నారు. ప్రస్తు త ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీపై చొరవ చూపుతుండడంతో ఇకనైనా కల నెరవేరుతుందని వారు ఆశిస్తున్నారు.



నేలకొండపల్లి మండలం సింగారెడ్డిపాలెంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల సముదాయం

రేకుల షెడ్‌లోనే ఉంటున్నాం..



మాకు ఇల్లు లేదు. దీంతో చిన్నపాటి రేకుల ఇంట్లో కుటుంబసభ్యులమంతా నివసిస్తున్నాం. వానాకాలంలో చిన్న వర్షం పడినా మొత్తం కురుస్తోంది. దీంతో ఇబ్బంది పడుతున్నాం. మా పంచాయతీలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టినా ఇంకా ఇవ్వలేదు. నాతో పాటు పలువురు దరఖాస్తు చేసుకున్నారు. ఇకనైనా మాలాంటి వారికి ఇళ్లు ఇస్తే కష్టాలు తీరుతాయి.
– కొదావత్ హచ్య, దుబ్బ తండా, కూసుమంచి మండలం

పారదర్శకంగా ఓటరు జాబితా..

- పరిశీలకురాలు బాలమాయాదేవి
- మూడు జిల్లాల అధికారులతో సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న బాల మాయాదేవి

ఖమ్మంసహకారనగర్: అర్హులైన ప్రతీఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తూ పారదర్శకంగా జాబితా ఉండాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి.బాలమాయాదేవి సూచించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో సోమవారం ఆమె ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా తుది ఓటర్ల జాబితా, మహిళలు, పురుషుల నిష్పత్తి, గుర్తింపు కార్డుల పంపిణీ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఓటర్ల తుది జాబితా విజయవంతంగా ప్రచురించడంపై అధికారులను అభినందించారు. అయితే, ఇప్పుడే కాక ఇతర సమయాల్లో దరఖాస్తులు స్వీకరించి అర్హులకు ఓటు హక్కు కల్పించాలని, చనిపోయిన పేర్లు తొలగించడంపై దృష్టి సారించాలని సూచించారు. అంతేకాక ఓటర్ల తుది జాబితాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని తెలిపారు. అనంతరం ఖమ్మం అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ 98.15 శాతం మేర పూర్తయిందన్నారు. అలాగే, చనిపోయినవారి పేర్ల తొలగింపునకు ప్రత్యేక సర్వే చేశామని, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల ద్వారా అందే సమాచారంతో ఎప్పటికప్పుడు మార్పులు చేస్తున్నామని వెల్లడించారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 12,30,572 మంది ఓటర్లతో తుది ఓటరు జాబితా రూపొందించామని తెలిపారు.

డైట్ అమలుపై ప్రత్యేక దృష్టి
బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని గురుకులాలలో విద్యార్థులకు కామన్ డైట్ అమలయ్యేలా అధికారులు పరిశీలించాలని బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ కూడా అయిన బాల మాయాదేవి సూచించారు. అన్ని హాస్టళ్లలో తరచుగా తనిఖీ చేయడం ద్వారా ఫలితాలు వస్తాయన్నారు. ఈ విషయంలో అధికారులు చొరవ తీసుకోవాలని తెలిపారు. ఈసమావేశంలో మూడు జిల్లాల అధికారులు ఈఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు పాల్గొన్నారు.

కాల్వొడ్డు మున్నేరులో మరో మార్గం



నూతన రహదారిపై ఖమ్మం వైపు వస్తున్న వాహనాలు

ఖమ్మంగాంధీచౌక్: గత ఏడాది సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వరదలతో ఖమ్మంలో మున్నేరుపై నిర్మించిన వంతెనలు ప్రమాదకరంగా మారాయి. సుమారు వందేళ్ల క్రితం కాల్వొడ్డులో నిర్మించిన వంతెనతో పాటు ప్రకాష్‌నగర్‌లోని వంతెన పైనుంచి భారీ వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లను మాత్రమే అనుమతిస్తుండగా కాల్వొడ్డు వంతెన సమీపాన మున్నేరు ప్రవాహం ఇటీవల తగ్గింది. దీంతో బ్రిడ్జి కింద చప్టా మాదిరి బీటీ రోడ్డు వేసి ఖమ్మంకు వచ్చే వాహనాలను అనుమతిస్తున్నారు. ఇక ఖమ్మం నుంచి హైదరాబాద్, వరంగల్, కోదాడ వైపునకు వెళ్లే వాహనాలకు యథావిధిగా పాత వంతెన పైనుంచి పంపిస్తున్నారు. వన్‌వే పద్ధతిలో రాకపోకలు జరుగుతుండడంతో రద్దీకి చెక్ పెట్టినట్లయింది. అంతేకాక పాత వంతెన వద్ద తీగల వంతెన నిర్మాణ పనులు జరుగుతుండగా ఆటంకం ఎదురుకాకుండా రెండో రహదారి ఉపయోగపడుతోంది.

ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు..

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మంసహకారనగర్: ప్రజావాణిలో దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆయన అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి దరఖాస్తులు,వినతిపత్రాలు స్వీకరించారు. ఈసందర్భంగా సత్తుపల్లి మండలం గంగారం పీహెచ్‌సీకి చెందిన ఎస్.మారేశ్వరి తాను కాంటింజెంట్ వర్కర్‌గా పనిచేస్తుండగా రూ.5వేల వేతనాన్ని 30నెలలుగా ఇవ్వడం లేదని ఫిర్యాదు చేయడంతో వెంటనే పరిష్కరించాలని డీఎంహెచ్‌ఓకు సూచించారు. అలాగే, పలువురి సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపిన కలెక్టర్ మిగతా దరఖాస్తులపై అధికారులకు సూచనలు చేశారు. ప్రజావాణిలో డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీఆర్‌ఓ రాజేశ్వరి, కలెక్టరేట్ ఏఓ అరుణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఆమె'దే ఆధిక్యం !

- జిల్లా ఓటర్ల తుది జాబితా విడుదల
- మొత్తం ఓటర్లు 12,30,572 మంది



ఖమ్మంసహకారనగర్: జిల్లా ఓటర్ల తుది జాబితాను సోమవారం అధికారులు ప్రకటించారు. ఈ జాబితా ప్రకారం జిల్లాలో 12,30,572 మంది ఓటర్లు ఉండగా పురుషుల కన్నా 44,884 మంది మహిళలు ఎక్కువగా ఉండడం విశేషం. మొత్తంగా 5,92,800 పురుషులు, 6,37,684 మంది మహిళలు ఉండగా ఇతరులు 88మంది ఉన్నారు. అలాగే, సర్వీస్ ఓటర్లు 688 మంది, ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు 192 మంది ఉన్నట్లు జాబితా ద్వారా వెల్లడైంది. ఈ జాబితాను జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కార్యాలయాల్లో ప్రచురించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలు, 1,460 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 2024 ఓటర్ల జాబితా ప్రకారం 12,27,230 మంది ఓటర్లు ఉండగా.. ప్రస్తుతం 8,582 మంది కొత్త ఓటర్లను చేర్చగా.. 5,240 మందిని తొలగించారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు
ఖమ్మం	1,55,326	1,68,859	49
పాలేరు	1,16,655	1,26,225	08
మధిర	1,07,550	1,15,805	10
వైరా	94,196	1,00,340	04
సత్తుపల్లి	1,19,073	1,26,455	17
మొత్తం	5,92,800	6,37,684	88

మిర్చి ధర వెనుకడుగు..



ఖమ్మంవ్యవసాయం: మిర్చి కొత్త పంట విక్రయాలు క్రమంగా పెరుగుతుండగా ధర మాత్రం పతనం దిశగా సాగుతోంది. ఈ ఏడాది మిర్చిని కొంత ముందుగా సాగు చేయడంతో పంట కూడా ముందుగానే చేతికొస్తోంది. ఈనేపథ్యాన సోమవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు 11,006 బస్తాల తేజా మిర్చి, 1,005 తాలు మిర్చితో పాటు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చి 2,610 బస్తాలను విక్రయానికి తీసుకొచ్చారు. ఇందులో కొత్త మిర్చికి గరిష్టంగా రూ.15,800, మోడల్ ధర రూ.14వేలుగా నమోదవడంతో పాటు కనిష్టంగా రూ.5వేల ధర నమోదైంది. ఇక నిల్వ చేసిన మిర్చికి గరిష్టంగా రూ.15వేలు, మోడల్ ధర రూ.12,500, కనిష్టంగా రూ.6వేల ధర దక్కింది. డిసెంబర్ 27న నిల్వ మిర్చి క్వింటాకు గరిష్టంగా రూ.16వేల ధర నమోదుకాగా ఇప్పుడు రూ.వేయి తగ్గడం గమనార్హం. గత ఏడాది సీజన్‌లో రూ.22వేల వరకు పలకగా, ఇప్పుడు ఆ దరిదాపుల్లో లేకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అంతర్జాతీయంగా మిర్చికి డిమాండ్ పడిపోవడం, విదేశీ ఎగుమతులు మందగించడమే ధర పతనానికి కారణాలుగా వ్యాపారులు విశ్లేషిస్తున్నారు.

ఎన్నికల కోలాహలం..

- జీపీ ఎన్నికలకు యంత్రాంగం ఏర్పాట్లు
- మూడు విడతల్లో నిర్వహించేలా ప్రణాళిక
- త్వరలోనే నోటిఫికేషన్ వస్తుందని ప్రచారం
- పోరుకు సిద్ధమవుతున్న ఆశావహులు



నేలకొండపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం

ఖమ్మంవన్‌టౌన్: గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల కోలాహలం మొదలైంది. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతుందనే ప్రచారంతో ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పండుగలు, పబ్బాలకు తాయిలాలు ఇస్తుండడమే కాక శుభ, అశుభ కార్యాల్లో స్థానికులతో మమేకమవుతున్నారు. రానున్న ఎన్నికల్లో పోటీకి దిగుతున్నట్లు సంకేతాలు ఇస్తూ ప్రజలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మరోపక్క ఎన్నికలు ఎప్పుడు జరిగినా సిద్ధంగా ఉండేలా అధికారులు ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఇప్పటికే జీపీలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధమవగా పోలింగ్ కేంద్రాలను సైతం గుర్తించారు. జిల్లాలోని 20 మండలాల్లో ఉన్న 589 జీపీల్లో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించాలని కార్యాచరణ రూపొందించి ఆ మేరకు బ్యాలెట్ బాక్సులు సమకూర్చుకుంటూ ఇతర ఏర్పాట్లపై కూడా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

జిల్లాలో జీపీలు, వార్డుల వివరాలు

మొత్తం పంచాయతీలు	589
వార్డులు	5,398
పోలింగ్ కేంద్రాలు	5,438
మొత్తం ఓటర్లు	8,64,702
మహిళలు	4,46,527
పురుషులు	4,18,151
ఇతరులు	24
సిద్ధంగా ఉన్న బ్యాలెట్‌బాక్సులు	3,146

సర్వం సన్నద్ధం
ఇప్పటికే ఓటర్ల జాబితా సిద్ధం కాగా, జిల్లాలో ఉన్న బ్యాలెట్ బాక్సులను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేయించారు. ఇలా 3,146 బ్యాలెట్ బాక్సులు సమకూరగా ఇంకా అవసరమైన వాటిని సమీపాన ఉన్న ఆంధ్రప్రదేశ్ నుండి సమకూర్చుకోనున్నారు. అలాగే, బ్యాలెట్ పత్రాలలో అభ్యర్థుల పేర్లు ఉండకుండా గుర్తులే ఉంటుండడంతో బ్యాలెట్ పత్రాల ముద్రణకు టెండర్లు సైతం ఆహ్వానించారు. జిల్లాలోని 589 పంచాయతీలు, 5,398 వార్డుల ఆధారంగా వార్డు సభ్యులు, సర్పంచ్ పదవులకు అవసరమైన బ్యాలెట్ పత్రాలను ముందుగానే ముద్రించాలని నిర్ణయించారు. ఇక ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఉద్యోగులను గుర్తించి శిక్షణ ఇచ్చేందుకు మాస్టర్ ట్రెయినర్లను సైతం ఎంపిక చేశారు. మొదటి దశలో 2,393, రెండో దశలో 2,343, మూడోశలో 2,090 మంది కలిపి మొత్తంగా ఎన్నికల విధుల్లో 6,826 మంది అధికారులు, సిబ్బంది పాల్గొననున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా నిర్వహించేలా సిద్ధమవుతున్నామని జిల్లా పంచాయతీ అధికారులు తెలిపారు.

సంక్రాంతికి సందడే...
పల్లెపోరుకు ఈసారి యువతీయువకులు ఆసక్తి చూపుతున్నారు. గత పదేళ్లుగా బీఆర్‌ఎస్ అధికారంలో ఉండడంతో ఆ పార్టీకి చెందిన వారే వార్డుసభ్యులు, సర్పంచ్‌లుగా గెలుపొందారు. ఇప్పుడు అధికార మార్పిడి జరగడంతో కాంగ్రెస్ నుండి పోటీ చేసేందుకు ఎక్కువ మంది ఉవ్విళ్లూరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యేలను తరచూ కలిసి తమకే టికెట్ కేటాయించాలని కోరుతున్నారు. ఇక సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో ముగ్గుల పోటీలు, ఇతర క్రీడాపోటీలు నిర్వహించి పెద్దమొత్తంలో నగదు బహుమతులు ఇవ్వడం ద్వారా తమ పోటీపై సంకేతాలు ఇచ్చేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాగా, ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తుండడంతో తమ విజయం సులభమవుతుందని కాంగ్రెస్ నుంచి పోటీకి దిగనున్న వారు నమ్ముతుండగా.. హామీల అమలులో వైఫల్యమైన కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమి, తమ విజయానికి బాటలు వేస్తుందని బీఆర్‌ఎస్ నేతలు చెబుతున్నారు. ఇలా రకరకాల సమీకరణలతో పల్లెపోరు మరింత రసవత్తరంగా మారే అవకాశముంది.

మొదటి దశ ఎన్నికలు జరిగే మండలాలు

మండలం	జీపీలు	వార్డులు
కూసుమంచి	41	364
తిరుమలాయపాలెం	40	356
ఖమ్మం రూరల్	31	312
నేలకొండపల్లి	32	300
ముదిగొండ	25	246
కామేపల్లి	24	218
మొత్తం	193	1,796
రెండో దశ		
ఏన్కూరు	25	216
తల్లాడ	27	252
కల్లూరు	31	288
పెనుబల్లి	33	298
సత్తుపల్లి	21	208
వేంసూరు	26	244
సింగరేణి	41	356
మొత్తం	204	1,862
మూడో దశ		
రఘునాథపాలెం	37	308
కొణిజర్ల	27	254
వైరా	22	200
ఎర్రుపాలెం	31	284
మధిర	27	236
బోనకల్	22	210
చింతకాని	26	248
మొత్తం	192	1,740

క్లుప్తంగా

కేయూ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా విశాల్


విశాల్ యాదవ్

ఖమ్మం స్పోర్ట్స్: కాకతీయ యూనివర్సిటీ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా ఖమ్మంకు చెందిన బి.విశాల్ యాదవ్ ఎంపికయ్యాడు. ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఆయన కెప్టెన్‌గా నియమించారు. కాగా, విశాల్ ఎంపికపై సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

యూఈఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రసాద్


ఎం ప్రసాద్

ఖమ్మంవ్యవసాయం: యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(యూఈఈయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎం.ప్రసాద్ ఎన్నికయ్యారు. సిద్దిపేటలో రెండు రోజుల పాటు యూనియన్ రాష్ట్ర మహాసభలు జరగగా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ మేరకు ఖమ్మం ఎస్ఈ కార్యాలయం ఉద్యోగి ప్రసాద్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించిన ప్రసాద్‌ను పలువురు అభినందించారు.

వయోజన విద్య డీడీ బాధ్యతల స్వీకరణ

ఖమ్మంసహకారనగర్: వయోజన విద్య జిల్లా డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీడీగా ఉన్న అధికారి ఉద్యోగ విరమణ చేయగా ఆ స్థానంలో అనిల్‌కుమార్‌ను నియమించారు. దీంతో ఆయన విధుల్లో చేరగా కార్యాలయ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి

చింతకాని: మండలంలోని జగన్నాథపురానికి చెందిన చిర్ర వెంకటేశ్వర్లు(40) ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆయన ఆదివారం మధ్యాహ్నం తన మిర్చి తోటలో కలుపు నివారణ మందు కొట్టేందుకు అపస్మారక స్థితిలో పడిపోయాడు. దీంతో ఆయనకు కుమారుడు రఘు ఫోన్ చేసినా స్పందన లేక వెళ్లే సరికి వెంకటేశ్వర్లు పడిపోయి ఉన్నాడు. ఈమేరకు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అయితే, ఆయన కలుపు నివారణ మందు తాగాడా, లేక మందు ప్రభావంతో అపస్మారక స్థితికి చేరాడా అనేది తేలాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగుల్ మీరా తెలిపారు.

ఫిర్యాదు చేశారని దాడి

ఖమ్మంఅర్బన్: ఇంటి స్థల వివాదంలో తమపై పోలీసులకు ఫిర్యాదు చేశారని మహిళపై మరోమారు దాడి చేసిన ఘటన ఇది. ఖమ్మం రామన్నపేట కాలనీలో ఆదివారం ఒక మహిళలపై దాడి చేయగా ఆమె ఖమ్మం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆగ్రహించిన ఎదుటి వర్గం వారు సోమవారం మరోమారు మహిళలను తీవ్రంగా కొట్టారు. ఈమేరకు ఆమె పోలీసులను ఆశ్రయించింది.

రెండు ఇసుక లారీలు సీజ్

ముదిగొండ: ఏపీ నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక లారీలను మండలంలోని న్యూలక్ష్మీపురం సమీపాన హైవే అండర్‌పాస్ వద్ద పోలీసులు సోమవారం సీజ్ చేశారు. ఏఎస్సై శ్రీనివాసరావు, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా ఏపీలోని ఇందుగుపల్లి ర్యాంపు నుంచి అనుమతి లేకుండా తెలంగాణలోకి ఇసుక తీసుకొస్తున్నట్లు గుర్తించారు. ఈమేరకు రెండు లారీలను సీజ్ చేసి ఇద్దరు డ్రైవర్లు, యజమానిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఓ.మురళి తెలిపారు.

మధిరలో బైక్ చోరీ

మధిర: మధిర అంబేడ్కర్ సెంటర్ సమీపాన పార్కింగ్ చేసిన బైక్‌ను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి ఎత్తుకెళ్లాడు. ఎర్రుపాలెం మండలం మీనవోలుకు చెందిన రామిశెట్టి కృష్ణ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. రోజులాగే సైకిల్ స్టోర్ పక్కన బైక్ నిలపగా సాయంత్రానికి కనిపించలేదు. దీంతో సీసీ ఫుటేజీని పరిశీలించగా గుర్తు తెలియని ఎత్తుకెళ్లినట్లు తేలగా టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పేకాట స్థావరంపై దాడి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మండలం కృష్ణాపురం సమీపంలోని ఆయిల్‌పామ్ తోటలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో సోమవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి రూ.22,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కిరణ్ తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మిర్చి	15,800	5,000
మిర్చి తాలు	7,000	4,500
ఏసీ మిర్చి	15,000	6,000
ఏసీ తాలు	6,100	6,000
పత్తి	7,200	6,000

– ఖమ్మం వ్యవసాయం

మమ్మల్నీ ఆదుకోండి..

రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్ట్ లెక్చరర్ల విన్నపం

- జిల్లాలో 139 మంది సర్వీసుల క్రమబద్ధీకరణ
- మరో 29మంది ఎదురుచూపులు



ఖమ్మం సహకారనగర్: జూనియర్ కళాశాలల్లో పూర్తిస్థాయి సబ్జెక్టు అధ్యాపకులు లేని చోట కాంట్రాక్ట్ విధానంలో పలువురి నియమించి బోధన సాగిస్తున్నారు. ఒకటి, రెండు కాదు చాన్నాళ్లుగా వీరు బోధిస్తుండగా ఏటేటా రెన్యువల్ జరుగుతోంది. అయితే, కాంట్రాక్టు అధ్యాపకులను గత ప్రభుత్వం రెగ్యులర్ చేసింది. ఈక్రమాన జిల్లాలోని 21ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 168 మందికి గాను 139 మంది సర్వీసు క్రమబద్ధీకరించారు. ఇక మిగతా 29మందిని వివిధ కారణాలతో రెగ్యులర్ చేయకపోవడంతో ఒకేషనల్ కోర్సులు బోధిస్తున్న వారు సానుకూల నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు.

ఆనందం.. అంతలోనే నిరాశ

గత ప్రభుత్వ హయంలో కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేస్తామని హామీ ఇవ్వడంతో అందరూ ఆనందించారు. ఆ తర్వాత వివిధ కారణాలు చూపించి జిల్లాలోని 29మందిని రెగ్యులర్ చేయకుండా పక్కన పెట్టేశారు. పోస్టుల మంజూరు లేదని అధికారులు చెబుతుండగా, నిబంధనల ప్రకారం తమను ప్రస్తుత ప్రభుత్వమైనా రెగ్యులర్ చేయాలని వారు కోరుతున్నారు. ఒక ఖమ్మం జిల్లాలోనే కాక పలు జిల్లాల్లో ఈ పరిస్థితి నెలకొన్నందున ప్రభుత్వం స్పందించాలని విన్నవిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం...



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న మమ్మల్ని కూడా రెగ్యులర్ చేయాలి. వేతనాలు సరిపోక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాం. పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి అద్దె కట్టలేక మనోవేదనకు గురవుతున్నాం.

– జంపాల కిరణ్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఖమ్మం

ఏళ్లుగా అధ్యాపక వృత్తిలోనే..



మేమంతా 20ఏళ్లుగా కాంట్రాక్టు విధానంలో పనిచేస్తుండగా కొందరిని రెగ్యులర్ చేశారు. అధ్యాపక వృత్తినే నమ్ముకున్న మమ్మల్ని కూడా రెగ్యులర్ చేస్తే ఆదుకున్నట్లవుతుంది. తద్వారా మా కుటుంబాలకు న్యాయం చేయాలి.

– సింధు చౌదరి, నయబజార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఖమ్మం

ఈ ప్రభుత్వంపైనే ఆశలు



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒకేషనల్ కాంట్రాక్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్న మాకు న్యాయం చేయాలి. ఇంటర్మీడియట్ బోర్డు 22కోర్సుల విద్యార్థులపై సర్వీస్ రూల్స్ రూపొందించాలి. తద్వారా ఇబ్బందులు రాకుండా చూడాలి.

– ఎం.డీ.రఫీ, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఖమ్మం

లోఓల్టేజీ, బిల్లుల్లో వ్యత్యాసంపై ఫిర్యాదులు


చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు అందజేస్తున్న కార్పొరేటర్ వలరాజు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ లోఓల్టేజీ సమస్యతో పాటు బిల్లుల్లో వ్యత్యాసాలు, అంతరాయాలపై పలువురు వినియోగదారుల ఫిర్యాదు చేశారు. ఖమ్మం మమత రోడ్డులోని సబ్ స్టేషన్‌లో సోమవారం సదస్సు ఏర్పాటుచేయగా, విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ ఎస్.వీ.వేణుగోపాలాచారి, సభ్యులు కె.రమేష్, ఆర్.చరణ్‌దాస్, ఎం.రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మమత రోడ్డు, ఖమ్మం అర్బన్, టౌన్-3, 4 సెక్షన్ల పరిధిలోని వినియోగదారులు పలు సమస్యలను ఫోరం దృష్టికి తీసుకువచ్చారు. మమత రోడ్డు, కొత్తగూడెం, గొల్లగూడెం, మధురానగర్, రుద్రంకోట తదితర ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్య ఉందని ఆ ప్రాంత కార్పొరేటర్ కూరాకుల వలరాజు వెల్లడించారు. మరికొందరు సింగిల్ ఫేజ్‌తో ఎదురవుతున్న సమస్యలను విన్నవించడంతో పాటు బిల్లుల్లో వ్యత్యాసాలు ఉంటున్నాయని తెలిపారు. ఈమేరకు బిల్లులకు సంబంధించి ఇద్దరి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా మిగతా సమస్యలను వారంలోగా పరిష్కరించాలని చైర్‌పర్సన్ వేణుగోపాలాచారి అధికారులను ఆదేశించారు. అలాగే, బిల్లుల్లో వ్యత్యాసం రాకుండా చూడాలని, లోఓల్టేజీ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సదస్సులో ఖమ్మం ఎస్ఈ ఏ.సురేందర్, డీఈ నంబూరి రామారావు, ఏడీఈ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

108 వాహనాల తనిఖీ


కేసుల వివరాలు పరిశీలిస్తున్న మేనేజర్ నాగేందర్

సత్తుపల్లి రూరల్/దమ్మపేట: సత్తుపల్లి, దమ్మపేటలో 108 అంబులెన్స్ వాహనాలను ఉమ్మడి జిల్లా మేనేజర్ భూమా నాగేందర్ సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా అంబులెన్స్‌ల్లో పరికరాల పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించిన ఆయన రికార్డుల్లో వివరాలను తనిఖీ చేశారు. ఫోన్ రాగానే సకాలంలో బాధితుల వద్దకు చేరడం ద్వారా ఆపదలో ఉన్న వారిని ఆదుకోవచ్చని తెలిపారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు అప్పారావు, సాకిరి రమేష్, పైలట్లు ఏకాంత్‌గౌడ్, లాల్‌సింగ్ పాల్గొన్నారు.

గంజాయి అమ్మకాలు, వినియోగాన్ని నియంత్రించాలి


వీసీలో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీలు ప్రసాద్‌రావు, నరేష్‌కుమార్

ఖమ్మంక్రైం: జిల్లాలో గంజాయి సహా మాదక ద్రవ్యాల అమ్మకం, వినియోగాన్ని సమూలంగా నిర్మూలించేలా ప్రత్యేక దృష్టి సారించాలని అడిషనల్ డీసీపీలు ప్రసాద్‌రావు, నరేష్‌కుమార్ ఆదేశించారు. ఖమ్మం నుంచి జిల్లాలోని పోలీసు అధికారులతో సోమవారం వారు వివిధ అంశాలపై సమీక్షించారు. విద్యార్థులు మత్తుపదార్థాల జోలికి వెళ్లకుండా విద్యాసంస్థల్లో ప్రత్యేక కమిటీల ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే, గ్రామాలలో ర్యాలీలు, సదస్సులు నిర్వహించి మాదక ద్రవ్యాల వినియోగంతో ఎదురయ్యే అనర్థాలను వివరించాలన్నారు. ఇక సైబర్ నేరగాళ్ల చేతిలో ఎవరైనా మోసపోతే వెనువెంటనే 1930కు ఫోన్ చేసేలా అవగాహన కల్పించాలని తెలిపారు. తద్వారా నేరగాళ్ల నగదు విత్‌డ్రా చేయకుండా అడ్డుకట్ట వేయొచ్చని చెప్పారు. ఇక ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ పర్యవేక్షణలో ఇప్పటికే గుర్తించిన 68 బ్లాక్ స్పాట్ల వద్ద బారికేడ్లు, స్టాపర్లు, సిగ్నల్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయించాలని తెలిపారు.

28.8 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

కారేపల్లి: ఒక లారీ, టాటా ఏస్‌లో అక్రమంగా తరలిస్తున్న 28.8 టన్నుల రేషన్ బియ్యాన్ని ఖమ్మం టాస్క్‌ఫోర్స్, కారేపల్లి పోలీసులు సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం వేపలగడ్డకు చెందిన బానోతు కోటేష్, ఇల్లెందుకు చెందిన లారీ డ్రైవర్ సంతోష్, టాటా ఏస్ డ్రైవర్ భూక్యా నాగరాజు కలిపి రెండు వాహనాల్లో 28.8 టన్నుల రేషన్ బియ్యాన్ని సోమవారం తెల్లవారుజామున ఇల్లెందు నుంచి ఖమ్మం వైపు తరలిస్తున్నారు. ఈ విషయంపై అందిన సమాచారంతో ఖమ్మం టాస్క్‌ఫోర్స్, కారేపల్లి పోలీసులు తనిఖీలు చేపట్టి లలితాపురం సమీపంలో పంతుల్‌నాయక్ తండా వద్ద వాహనాలను అడ్డుకున్నారు. ఈమేరకు రేషన్ బియ్యంతో సహా వాహనాలను పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్ఐ ఎన్.రాజారాం తెలిపారు.

మధ్యాహ్న భోజన బియ్యంలో పురుగులు


తుట్టెలు కట్టి పురుగులు పట్టిన బియ్యం

కొణిజర్ల: విద్యార్థులకు నిర్దేశిత మెనూ ఆధారంగా భోజనం సమకూర్చాలని ప్రభుత్వం ఆదేశిస్తుండగా, కొణిజర్ల మండలంలోని పలు పాఠశాలలకు సరఫరా బియ్యం తుట్టెలు కట్టడంతో పాటు పురుగులు రావడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారు. మండలంలోని పెద్దగోపతి, సింగరాయపాలెం, తనికెళ్ల తదితర పాఠశాలల్లో సోమవారం మధ్యాహ్న భోజనం తయారీకి సిద్ధమవుతుండగా బియ్యంలో పురుగులు రావడంతో ఉపాధ్యాయులకు తెలిపారు. దీంతో వారు ఎంఈఓ డి.అబ్రహం దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై ఎంఈఓ మాట్లాడుతూ గత డిసెంబర్‌లో పాఠశాలలకు సరఫరా చేసిన బియ్యం చివరి దశకు చేరగా పురుగులు వచ్చినట్లు తెలిసిందన్నారు. ఈమేరకు డీఈఓ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు బియ్యం మారుద్దామని వైరా ఎంఎల్ఎస్ పాయింట్ వెళ్తే అక్కడా స్టాక్ లేదని చెప్పారని తెలిపారు. దీంతో బియ్యం శుభ్రం చేయించి భోజనం వండించామని వెల్లడించారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

షాపు యజమానే కారణమని ఆందోళన


కంభంపాటి నందిని (ఫైల్)

మధిర: రెడీమేడ్ దుకాణంలో పనిచేస్తున్న ఒక యువతి ఈనెల 1న షాప్‌నకు వెళ్లకపోవడంతో యజమాని మందలించగా మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది. మండలంలోని ఆత్కూరుకు చెందిన కంభంపాటి నందిని(22) మధిర మెయిన్ రోడ్డులో ఉన్న రెడీమేడ్ దుకాణంలో ఎనిమిదేళ్లుగా పనిచేస్తోంది. ఈనెల 1న ఆమెతో పాటుమరో ముగ్గురు షాపునకు వెళ్లకపోగా ఈనెల 2న వెళ్లేసరికి యజమాని మందలించాడు. అంతేకాక షాపునకు రావొద్దని పంపించినట్లు సమాచారం. దీంతో నందిని పలు చోట్ల పని కోసం ప్రయత్నించినా ఫలితం లేక, అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిని ఎలా పోషించాలో తెలియక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు ఘటనకు షాపు యజమానే కారణమంటూ ఆమె బంధువులు, గ్రామస్తులు దుకాణం వద్ద ఆందోళనకు దిగారు. అక్కడ ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు నచ్చచెప్పి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రూ.2 కోట్ల విలువైన మాదకద్రవ్యాల దహనం


కాల్చివేసే ముందు గంజాయిని పరిశీలిస్తున్న అధికారులు

తల్లాడ: ఖమ్మం, మధిర, నేలకొండపల్లి ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో స్వాధీనం చేసుకున్న 831 కిలోల గంజాయి, 11 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను ఎక్సైజ్ పోలీసులు సోమవారం దహనం చేశారు. తల్లాడ మండలం గోపాలపేటలో ఏడబ్ల్యూఎం కన్సల్టింగ్ లిమిటెడ్ ద్వారా వీటిని కాల్చివేయించారు. రూ.2 కోట్ల విలువ చేసే గంజాయి, డ్రగ్స్‌ను దహనం చేయగా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జి.జనార్దన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ జి.గణేష్, డీసీఈఓ నాగేందర్‌రెడ్డి, ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలుశిక్ష

ఖమ్మంలీగల్: అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో హైదరాబాద్ దోమలగూడకు చెందిన కోర్టు ఉద్యోగి తట్టరి ప్రమీలకు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమశ్రేణి న్యాయమూర్తి ఏపూరి బిందుప్రియ సోమవారం తీర్పు చెప్పారు. ఖమ్మం కవిరాజ్‌నగర్‌లో నివాసముండే బయ్య సరోజ వద్ద ప్రమీల 2017 డిసెంబర్ 4న రూ.10.50 లక్షలు అప్పుగా తీసుకుంది. ఆపై తీర్చే క్రమాన 2018 జూలైలో రూ.10 లక్షలకు చెక్ జారీ చేయగా ఖాతాలో సరిపడా నగదు లేక చెక్ నిరాదరణకు గురైంది. దీంతో సరోజ న్యాయవాది కె.అమర్‌నాథ్ ద్వారా కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేయగా విచారించిన న్యాయమూర్తి ఆరు నెలల జైలుశిక్ష విధించడంతో పాటు ఫిర్యాదికి రూ.10 లక్షలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

మరో మహిళకు ఏడాది...

ఖమ్మం లీగల్: చెల్లని చెక్కు జారీ చేసిన ఖమ్మం పాండురంగాపురానికి చెందిన పల్లెబోయిన అరుణకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి రాళ్లబండి శాంతిలత సోమవారం తీర్పు చెప్పారు. పాండురంగాపురానికే చెందిన పాండుగుల కృష్ణమోహన్ వద్ద అరుణ 2016 డిసెంబర్‌లో రూ.2.50లక్షల అప్పు తీసుకోగా తిరిగి చెల్లించే క్రమాన 2017 జూన్‌లో చె జారీ చేసింది. అయితే, ఆమె ఖాతాలో సరిపడా నగదు లేక చెక్కు బౌన్స్ కావడంతో అరుణ తన న్యాయవాది స్వామి రమేష్కుమార్ ద్వారా లీగల్ నోటీసు పంపి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేసింది. ఈ విచారణ అనంతరం ఆమెకు ఏడాది జైలుశిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.2.50లక్షలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

విద్యుత్ లైన్లకు దూరంగా పతంగులు ఎగురవేయాలి

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ లైన్లకు దూరంగా ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే పతంగులు ఎగరవేయాలని ఎన్పీడీసీఎల్ ఖమ్మం ఎస్ఈ ఏ.సురేందర్ ఓ ప్రకటనలో సూచించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పతంగులు ఎగురవేసేందుకు పిల్లలు, పెద్దలు సిద్ధమవుతున్న నేపథ్యాన సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పతంగులు ఎగురవేస్తే మాంజాలు లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై పడి ప్రమాదాలు ఎదురయ్యే అవకాశముందని తెలిపారు. ఈ నేపథ్యాన జాగ్రత్తలు వహించాలని చెప్పారు. అలాగే, చైనా మంజా కాకుండా సాధారణ దారమే ఉపయోగించాలని.. తద్వారా మనుషులు, పక్షులకు ప్రమాం జరగదని, విద్యుత్ లైన్లకు కూడా ఇబ్బంది ఉండదని తెలిపారు. కాగా, గాలిపటం ఎగురవేసే సమయాన తీగలకు దారం చుట్టుకుంటే వదిలేయాలే తప్ప ఇనుప పైపులతో తొలగంచే ప్రయత్నం చేయొద్దని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ వైర్లు, పరికరాలపై పతంగులు, మాంజాలు పడినా, వైర్లు తెగి పడి సరఫరాకు ఆటంకం ఏర్పడితే నేరుగా తాకకుండా విద్యుత్ శాఖ సిబ్బందికి 1912 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సమాచారం ఇవ్వాలని ఎస్ఈ తెలిపారు.

విద్యార్థుల్లో ఆంగ్లంపై భయం పోగొట్టాలి

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


శిక్షణను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజ

కొణిజర్ల: విద్యార్థులకు ఇంగ్లిష్ నేర్చుకోవాలని, మాట్లాడాలనే ఆసక్తి ఉన్నా ఆత్మన్యూనతాభావంతో ధారాళంగా మాట్లాడలేకపోతున్నారని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. దీన్ని సరిదిద్దేలా తొలుత వారిలో భయాన్ని పోగొట్టాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 'వీ కెన్ లెర్న్' కార్యక్రమ అమలు కోసం కొణిజర్ల జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులకు బుధవారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌ను అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్టతో కలిసి పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తొలివిడతగా 16 పాఠశాలల్లో 'వీ కెన్ లెర్న్' పేరిట కార్యక్రమాన్ని అమలుచేస్తుండగా మరో 18 పాఠశాలలకు విస్తరిస్తున్నామన్నారు. ఈమేరకు ఉపాధ్యాయులు చొరవ తీసుకుని విద్యార్థులు పాఠశాలతో పాటు ఇంటి వద్ద కూడా ఆంగ్లంలో మాట్లాడేలా తర్ఫీదు ఇవ్వాలని తెలిపారు. ఇందుకోసం వారి పుట్టినరోజు, పండుగలు, ఇతర ప్రత్యేక సందర్భాలను తెలియజేస్తూ మాట్లాడిస్తే ఫలితం ఉంటుందని తెలిపారు. ఇందుకోసం ప్రతిరోజు కొంత సమయం కేటాయించాలని సూచించారు. డీఈఓ ఈ.సోమశేఖరశర్మ, ఏఎంఓ కె.రవికుమార్, ఎంఈఓ డి.అబ్రహం, కార్యక్రమ మెంటార్లు ఆస్న, పవిత్ర దీక్షిత్, హెచ్ఎం శాంతకుమారి, ఈఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి జగదీష్‌తో పాటు సంక్రాంతి రవికుమార్, రామనాథం, ఎం.భాస్కర్ పాల్గొన్నారు.

వరంగల్ డిక్లరేషన్ అమలు చేయాల్సిందే...

బీఆర్ఎస్ ఆధ్వర్యాన నిరసన


నిరసనలో పాల్గొన్న వెంకటవీరయ్య, నాయకులు

తల్లాడ: ఎన్నికల సమయాన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రకటించిన 'వరంగల్ డిక్లరేషన్'ను వెంటనే అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధిష్టానం పిలుపు మేరకు సోమవారం జిల్లావ్యాప్తంగా నిరసన తెలపగా తల్లాడలో జరిగిన ఆందోళనలో సండ్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లాడ గ్రామపంచాయతీ కాంప్లెక్స్ ఎదురుగా ధర్నాలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వరికి రూ.500బోనస్ ఇచ్చినట్లుగా మిగతా పంటలకు కూడా ఇవ్వడంతో పాటు కౌలు రైతులను సైతం ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన తెలిపారు. మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వీరమోహన్‌రెడ్డి, నాయకులు వెంకట్‌లాల్, కోటిరెడ్డి, చలపతిరావు, మువ్వా మురళి, దాసురావు, శ్రీను, ఈసూబ్, ఉదయ్, అంబేడ్కర్, సత్యం, రాజశేఖర్ రెడ్డి, వీరకృష్ణ, హుస్సేన్, ఆశీర్వాదం పాల్గొన్నారు.

ప్రియాంకగాంధీపై వ్యాఖ్యలు గర్హనీయం


దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ ప్రియాంకగాంధీపై బీజేపీ అభ్యర్థి రమేష్ బిధూరి చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యాన సోమవారం ఖమ్మంలోని డీసీసీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి రమేష్ బిధూరి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార్ మాట్లాడుతూ బీజేపీ నాయకులకు మహిళలను చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ అధిష్టానం స్పందించి రమేష్ టికెట్‌ను రద్దు చేయడంతో పాటు యావత్ మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పుచ్చకాయల వీరభద్రం, మొక్కా శేఖర్‌గౌడ్, బొడ్డు బొందయ్య, సయ్యద్ గౌస్, మలీదు వేంకటేశ్వర్లు, పల్లెబోయిన భారతి చంద్రం, కన్నం వైష్ణవిప్రసన్న, గజ్జెల్లి వెంకన్న, గజ్జి సూర్యనారాయణ, భవాని పాల్గొన్నారు.

మెనూ కచ్చితంగా అమలు చేయాల్సిందే..

సోషల్ వెల్ఫేర్ గురుకులాల సంస్థ కార్యదర్శి వర్షిణి


విద్యార్థులతో మాట్లాడుతున్న గురుకులాల సంస్థ కార్యదర్శి వర్షిణి

ఎర్రుపాలెం: సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూను కచ్చితంగా అమలు చేయాలని సోషల్ వెల్ఫేర్ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి ఆదేశించారు. ఎర్రుపాలెంలోని గురుకుల పాఠశాలను సోమవారం తనిఖీ చేసిన ఆమె విద్యార్థులతో సమావేశమై మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, పోషక ఆహారం అందుతోందా, లేదా అని ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వ్యర్థాలతో కంపోస్టు తయారీపై కార్యాచరణ రూపొందించగా 'ప్లాస్టిక్ ఫ్రీ' వారం నిర్వహిస్తున్నామని తెలిపారు. కాగా, మెనూ అమలును ఇక నుంచి విద్యార్థి కమిటీలు కూడా పర్యవేక్షిస్తాయని వెల్లడించారు. మెరుగైన పారిశుద్ధ్య నమోదైన పాఠశాలలకు బహుమతులు అందచేస్తామని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో జోనల్ అధికారి కొప్పుల స్వరూపారాణి, పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఇంకా లభించని విద్యార్థి ఆచూకీ

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని పడమర లోకారానికి చెందిన విద్యార్థి పరిమి శివ ఆచూకీ సోమవారం సాయంత్రం వరకు కూడా సాగర్ కాల్వలో లభించలేదు. సెల్ఫీ తీసుకునే క్రమాన ఆదివారం ఆయన ప్రమాదవశాత్తు కాల్వలో పడి కొట్టుకుపోయిన విషయం విదితమే. ఈమేరకు ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం పొద్దుపోయే వరకు పడమర లోకారం నుండి కప్పల బంధం మెయిన్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్ వరకు గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు 4 కి.మీ. పరిధిలో సాగర్ ప్రధాన కాల్వలో గత ఈతగాళ్లతో గాలింపు చేపట్టినా ఫలితం కానరాలేదు. సాగర్ ప్రధాన కాల్వలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఈ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.